## క్లుప్తంగా

### రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

**అచ్చంపేట:** జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా అక్టోబరు 3 నుంచి 25వ తేదీ వరకు మండలంలోని 17 గ్రామ సచివాలయాల యాలు, 23 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో వైద్యసేవలు అందించనున్నట్లు ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. సేవల కోసం అచ్చంపేట, మాదిపాడు పీహెచ్‌సీ పరిధిలోని నలుగురు వైద్యులను రెండు టీములు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 3వ తేదీన చిగురుపాడు, రోకటిగుంటవారిపాలెం, 4న కోగంటివారిపాలెం, అంబడిపూడి, 5న కొండురు, నిండుజర్ల, శ్రీనివాసతండా, చట్టుబడితండా, 6న పెదపాలెం, 7న వేల్పూరు, 9న ఓర్వకల్లు, రుద్రవరం, 10న చెరుకుంపాలెం, కొత్తపల్లి గ్రామాలలో, 11న చల్లగరిగ, 12న చింతపల్లి, 13న మాదిపాడు, గింజుపల్లి, కుంటిమద్ది, జడపల్లితండా, కంచుబోడుతండా, 17న కస్తల, 18న గ్రంథశిరి, 19న తాళ్లచెరువు, 20న అచ్చంపేట, చామ్రు, 24న తాడువాయి, సంద్రతండా, 25న కోనూరు గ్రామాలలో వైద్యులు వైద్య పరీక్షలు చేసిన అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ వివరించారు.

### నేడు క్రోసూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

**క్రోసూరు:** ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గాంధీ జయంతి, మధ్యాహ్నం 2గంటలకు జగనన్న ఆరోగ్యసురక్ష, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు.

### 48 మద్యం బాటిళ్లు స్వాధీనం

**అమరావతి:** స్థానిక బస్టాండు సెంటర్‌లో పెదకూరపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ఇద్దరు నుంచి అక్రమంగా తరలిస్తున్న 48 మద్యం బాటిళ్లను ఆదివారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ ఎస్ఐ ఫణికుమార్ మాట్లాడుతూ అమరావతికి చెందిన తమ్మిశెట్టి శంకర్, మండల పరిధిలోని ధరణికోటకు చెందిన యెడ్లూరి ఏసోబు అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీ చేసినట్లు చెప్పారు. వీరి నుంచి 48 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదుపులోకి తీసుకున్న తమ్మిశెట్టి శంకర్, యెడ్లూరి ఏసోబులపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

### 15 నుంచి దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు

**సత్తెనపల్లి:** పట్టణంలోని త్రిశక్తి దుర్గా పీఠంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి వి.హనుమత్ స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా, 16న శ్రీ అర్ధనారీశ్వరిగా, 17న గాయత్రీ దేవిగా, 18న అన్నపూర్ణ దేవిగా, 19న మహాలక్ష్మిగా, 20న సరస్వతిగా, 21న లలితా దేవిగా, 22న దుర్గాదేవిగా, 23న మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### పార్టీ మండల అధ్యక్షుడిగా అప్పిరెడ్డి



**మాచర్ల రూరల్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈయన పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, మండల ఉపాధ్యక్షులు పోతురెడ్డి కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు. తనపై నమ్మకంతో కీలకమైన బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వ విప్ పీఆర్కే, జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

### అక్రమ మద్యం కేసులో నిందితుడు అరెస్ట్

**నరసరావుపేట టౌన్:** అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 5 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు చిత్రాలయ టాకీస్ వద్ద తనిఖీలు నిర్వహించి అక్రమంగా మద్యం కలిగిన కేసానుపల్లి గ్రామానికి చెందిన రావిపాటి వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్ల ఎస్ఐ తెలిపారు.

### ఎంబీబీఎస్ విద్యార్థినికి సాయం

**వినుకొండ(నూజెండ్ల):** వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని కనుగుల పూజితకు హిమాలయ గురూజీ చేతుల మీదుగా రూ.25వేలు అందజేశారు. పట్టణానికి చెందిన ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, సువర్చలదేవి దంపతులు రూ.25వేలు సాయాన్ని హిమాలయ గురూజీ చేతుల మీదుగా అందజేశారు. పూజితకు ఐదేళ్ల పాటు నెలకు రూ.7వేలు ట్రస్ట్ ద్వారా అందజేస్తామని వివరించారు. విద్యకోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలు అందజేస్తామని సభ్యులు తెలిపారు.

# స్వచ్ఛత .. మన బాధ్యత

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో స్వచ్ఛత హీ సేవ



పట్టణంలోని ఏరియా వైద్యశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు

**సత్తెనపల్లి:** పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం మెరుగుదల నిరంతర ప్రక్రియ అని, స్వచ్ఛత .. మన అందరి బాధ్యతని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ఆదివారం జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో నిర్వహించారు. మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత వైద్యశాల ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను స్వయంగా తొలగించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఒక రోజు వేడుక కార్యక్రమంలా కాకుండా నిరంతరం దీనిని కొనసాగించాలన్నారు. మన చుట్టూ వాతావరణం శుభ్రంగా ఉంటే ఆరోగ్యం మెరుగుపడుతుందని, వైద్యశాల స్వచ్ఛతగా ఉంటే మరికొందరికి స్ఫూర్తినిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం విశేషంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరావు నాయక్, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్లం విజయ భాస్కర రెడ్డి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి. లక్ష్మణరావు, ఆర్ఎంఓ శోభారాణి, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, ధూళిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివ నారాయణ పాల్గొన్నారు.

■ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏక్ తారీఖ్ ఏక్ గంట కార్యక్రమంలో భాగంగా ఆదివారం చీపుర్లు పట్టి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మేనేజర్ ఎస్.సాంబశివరావు, డీఈ బి.మధుసూదన్ రావు, ఆర్ఐ ఎంవీ అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయ సారథి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్.అనురాధ పాల్గొన్నారు.

■ అమృత్ కలశ యాత్రలో భాగంగా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో మేరీ మట్టి మేర దేశ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటి కి తిరిగి కళశాలలో మట్టి, బియ్యంని మేళ తాళాలతో సేకరించారు. స్వచ్ఛ త హీ సేవలో ఎక్ కి తారిక్ ఏకీ ఘంటీ అనే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మహాలక్ష్మమ్మ చెట్టు సెంటర్ లో శ్రమదానం చేసి వీధులను శుభ్రపరిచారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమ రావు, ఆంధ్ర బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నలబోతు శివన్నారాయణ, గ్రామ సర్పంచి కుంభ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కుంభ వీరమ్మ, నాయకులు కుంభా శ్రీనివాస రావు, కుంభా గోవిందు, చిలకా జయపాల్, కార్యదర్శి జి.శ్రీనివాస రావు, ఐటీసీ రిసోర్స్ పర్సన్ చెంబేటి బొలయ్య పాల్గొన్నారు.



పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు

■ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ శ్రీనివాసరావు నాయక్, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడారు. ముందుగా మహాత్మ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, శ్రీలత పాల్గొన్నారు.

■ సత్తెనపల్లి మండలం భట్లూరు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఏక్ తారీఖ్- ఏక్ గంట కార్యక్రమంలో ఆదివారం శ్రమదానం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛతే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పి.కృష్ణప్రసాద్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె.ప్రేమ్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, మేరీ, సుస్మిత పాల్గొన్నారు.

**నకరికల్లులో..**

**నకరికల్లు:** పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా సీ సేవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తొలుత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో



ముప్పాళ్లలో స్వచ్ఛతా హీ సేవ శ్రమదాన్‌లో పాల్గొన్న ఎంపీడీఓ పుట్టారెడ్డి

తహసీల్దార్ కె.నగేష్, ఏపీఓ రామకృష్ణ, ఈఓపీఆర్డీ ఎంకేఎస్ గిరిధర్ పాల్గొన్నారు.

**క్రోసూరు మండలంలో..**

**క్రోసూరు:** మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఊటుకూరులో ఎంపీపీ కోటయ్య నేతృత్వంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఎర్రబాలెంలో పంచాయతీ విస్తరణాధికారి , పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు జరిగాయి. పెరికపాడు సర్పంచి ఊడల శ్రీధర్ నేతృత్వంలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

**ముప్పాళ్లలో..**

**ముప్పాళ్ల:** స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం శ్రమదానం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణ పరిసరాలను పరిశుభ్రం చేశారు. చాగంటివారిపాలెం గ్రామసచివాలయ ఆవరణను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, ఎంఆర్‌సీ ఎం.బ్రహ్మానందం పాల్గొన్నారు.

**బెల్లంకొండ మండలంలో..**

**బెల్లంకొండ:** పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని అన్నీ గ్రామాలలో 'స్వచ్ఛతా హై సేవా' కార్యక్రమంలో భాగంగా అన్నీ గ్రామాలలో శ్రమదానం చేశారు. మండలంలోని న్యూ చిట్యాల గ్రామంలో ఎంపీడీఓ, తహసీల్దార్‌లతో ర్యాలీలో పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఇంటి పరిసరాలతో పాటుగా వీధులు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు పరిశుభ్రంగా ఉంచడం భాధ్యతగా భావించాలని కోరారు. అనంతరం గ్రామ సచివాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి శ్రమదానం చేశారు. స్వచ్ఛతా నినాదాలు చేసుకుంటూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. గ్రామస్తులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ నిర్మల, గ్రామ సర్పంచి భానావతు నరసింహానాయక్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత- మన అందరి బాధ్యత



స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యాలు

**అమరావతి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో గ్రామాల పరిశుభ్రత కోసం నిర్వహించే 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ధరణికోటలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచి మాదాసు పావని పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుడు వ్యక్తిగత శుభ్రతతో పాటుగా తమ ఇంటి పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అలపాటి వీరయ్య, రేషన్ డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు నడకుదురు నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు రాంబాబు, సరిపూడి శివయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి, కల్యాణ్ పాల్గొన్నారు.

## పేదలకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



గోధుమ పిండి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**పెదకూరపాడు(అమరావతి):** రాష్ట్రంలోని పేదలకు తక్కువ ధరకు పేదలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. పెదకూరపాడులో సబ్సిడీపై గోధుమ పిండి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డులు ద్వారా నాణ్యమైన గోధుమ పిండిని పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు.

### తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివ

**క్రోసూరు:** సామాజిక పింఛన్లు ఆదివారం 50 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ బి.మహేష్ తెలిపారు. మండలంలో 15 సచివాలయల ద్వారా ఆయా గ్రామాల వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం అక్టోబర్‌కు 8,931 మందికి మంజూరైనట్లు తెలిపారు. గతనెల కంటే ఈ నెల కొత్త పెన్షన్ దారులు 328 మందికి అదనంగా మంజూరైనట్లు చెప్పారు.

### వృద్ధాప్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

**పెదకూరపాడు(అమరావతి):** వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరూ ఆహార, ఆరోగ్యసూత్రాలను తప్పక పాటించాలని డాక్టర్ మేకల జాన్సన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాటిబండ్ల కారుణ్య వృద్ధాశ్రమంలో మెర్సీహోం ఫర్ ఎజ్డ్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మెర్సీహోం నిర్వాహకులు డాక్టర అల్లం ఇన్నారెడ్డి, శాంతి, స్లీవారెడ్డి, శౌరీలు, రాజారెడ్డి, వృద్ధాశ్రమ మేనేజర్ రాము పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్‌లకు సత్కారం



సత్కారం అందుకున్న సీనియర్ సిటిజన్‌లతో ఎన్నికల డీటీ బోస్ బాబు



ఎండ్రాయిలో 97ఏళ్ల వృద్ధుడికి సన్మానం చేస్తున్న సర్పంచి రాంబాబు

**సత్తెనపల్లి:** సీనియర్ ఓటర్లను ఆదివారం సత్కరించారు. ఎలక్షన్ కమిషన్, పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ సీనియర్ సిటీజన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. సీనియర్ ఓటర్లుగా వారి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ బోస్‌బాబు ఉన్నారు.

**సీనియర్ ఓటరుకు సన్మానం**

**అమరావతి:** అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గ్రామంలో అత్యధిక వయస్సు కలిన ఓటరును ఆదివారం సన్మానించారు. సర్పంచి నాయుడు రాంబాబు, సచివాలయ అధికారులు గ్రామంలో అత్యధికంగా 97 ఏళ్ల వృద్ధ ఓటరు బుడె సాహెబ్ ఇంటి వెళ్లి శాలువ కప్పి సత్కరించారు.

# జిల్లా స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



జిల్లా పోటీలకు ఎంపికైన రెంటచింతల రామకృష్ణ గురుకుల పాఠశాల విద్యార్థులు

**రెంటచింతల:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న అండర్-14, అండర్-17 పోటీలలో విశేష ప్రతిభ కనబరచిన స్థానిక శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులను జిల్లా పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ ఆత్మకూరి నాగేశ్వరరావు, హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో జిల్లా పోటీలకు విశేష ప్రతిభ కనబరచిన బాలబాలికలను ఎంపిక చేశారన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఆటల పోటీల ద్వారా విద్యార్థులకు తగిన శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని దీంతో వారు ఎంచుకున్న రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. గ్రామాలలోని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు ఆటలలో కూడా ప్రోత్సహించినప్పుడే నైపుణ్యం కలిగిన మెరుగైన క్రీడాకారులు తయారవుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధితో పాటు పాఠశాల స్థాయి నుంచే ఆటల పోటీలను నిర్వహించి ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అధికారినంటూ రూ.2 వేలు స్వాహా

**మాచవరం:** పింఛన్ల పరిశీలన అధికారినంటూ వయో వృద్ధురాలి వద్ద రూ.2 వేలు నగదును స్వాహా చేసిన ఘటన మండలంలోని తురకపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది. బాధితురాలు షేక్ ఫాతిమూన్‌కు ఆదివారం గ్రామ వలంటీర్ పింఛన్ డబ్బులు అందజేయడం జరిగింది. మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి పింఛన్ల పరిశీలన అధికారిని, ఆధార్‌కార్డు, పింఛన్ కార్డు, వలంటీర్ ఇచ్చిన నగదు చూపించాలని వృద్ధురాలిని అడిగాడు. అనంతరం ఆధార్ కార్డు, పింఛన్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురమ్మని వృద్ధురాలి మనవణ్ని బయటకు పంపి పింఛన్ డబ్బులతో ఉడాయించాడు. మోసాన్ని గ్రహించిన వృద్ధురాలు విషయాన్ని చుట్టు ప్రక్కల వాళ్లకు తెలియజేసింది.

### ఆరు ద్విచక్ర వాహనాలు చోరీ

**నరసరావుపేట టౌన్:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల అపహరణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 6 ద్విచక్ర వాహనాలు గడిచిన వారం రోజుల వ్యవధిలో అపహరణకు గురైనట్లు తెలిపారు. యజమానులు వాహనాల కోసం గాలించినా ఎటువంటి ప్రయోజనం లేకపోవటంతో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### అన్నదానం

**నకరికల్లు:** స్థానిక పాతూరులో రోడ్డులోని విఘ్నేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. నిమజ్జనం సోమవారం నిర్వహించనున్న సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ముందుగా భక్త సంఘం ఆధ్వర్యంలో స్వామికి విశేషపూజలు చేశారు.

# రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



రైతు సంఘం జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న నాయకులు

**నకరికల్లు:** పాలకుల చిత్తశుద్ధితోనే వ్యవసాయ రంగం లాభసాటిగా మారుతుందని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ అన్నారు. రైతు, కౌలు రైతు సంఘం కార్యకర్తల రెండురోజుల జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు జెండా ఆవిష్కరించారు. వై.రాధాకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వ రాయితీలు అమలు చేయక అప్పులు పెరిగిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వం రైతులతో పాటు కౌలు రైతులకు రాయితీలు, పంట నష్టపరిహారం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి వేపూరి గోపాలం, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు జి.పిచ్చారావు, ఈపూరి లక్ష్మారెడ్డి, ఈపూరి అప్పిరెడ్డి, చట్టు కోటేశ్వరరావు, ఎస్.రామాంజినాయక్, గోదా చిన్ని పాల్గొన్నారు.

# 3,4 తేదీల్లో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆరోగ్య కార్యకర్త

**శావల్యాపురం:** మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీ పరిధిలో రెండు గ్రామ సచివాలయాల పరిధిలో ఈనెల 3,4వ తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలో గంటావారిపాలెం, వెలమవారిపాలెం, శివారు గ్రామాలు ఉండగా 43 మంది వలంటీర్లు ఉన్నారని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు ఇరువురు పర్యవేక్షణలో ఆరోగ్య కార్యకర్త, ఎంఎల్‌హెచ్‌పీ రెండు టీంలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వేతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది హిమోగ్లోబిన్, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 90 శాతం సర్వే పూర్తి అయిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంపై కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఎస్.అమరలింగేశ్వరి, ఎం.విజయమ్మ, ఎంఎల్‌హెచ్‌పి మేరికుమారి, శ్యామలత పాల్గొన్నారు.

# బాలుడి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థికసాయం

**నరసరావుపేట:** పట్టణంలోని కోటసెంటర్ వంగవీటి రంగా విగ్రహం వద్ద ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మిరియాల గణేష్(11) కుటుంబాన్ని శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆ బాలుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా కాకుమానుబజార్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా ఇంటి స్థలం కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, మాజీ కౌన్సిలర్ చల్లా శివపార్వతి, వడ్డెర సంక్షేమ సంఘ జిల్లా సభ్యుడు వేముల శివ, వైఎస్సార్ సీపీ పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు అచ్చి శివ కోటి, కాంట్రాక్టర్ బత్తుల చంద్రశేఖర్, కాకుమాను బజార్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వాసవీ స్కాలర్‌షిప్ సొసైటీ సేవలు భేష్



వాసవీ స్కాలర్‌షిప్ సొసైటీ క్లాత్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట:** గత 25ఏళ్లుగా వాసవీ స్కాలర్‌షిప్ సొసైటీ సమాజానికి చేస్తున్న సేవలు అభినందించ తగినవని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాతూరులోని కుసుమ హరినాథ్‌బాబా మందిరంలో ఆదివారం స్కాలర్‌షిప్ సొసైటీ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి, డీఎస్పీ కేవీ మహేష్ హాజరయ్యారు. గోపిరెడ్డి మాట్లాడుతూ జిల్లా వాసవి సొసైటీని స్థాపించి సమాజ సేవ చేస్తున్న వ్యవస్థాపకుడు చీతిరాల గురు పెద్దన్నను అభినందించారు. అనంతరం సొసైటీ రూపొందించిన 5000 క్లాత్ బ్యాగ్స్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వాసవి స్కాలర్షిప్ సొసైటీ కమిటీ సభ్యులకు సన్మానం చేశారు. అదేవిధంగా పట్టాభి రామస్వామి దేవస్థానంలోని వేంకటేశ్వర కళ్యాణ మండపంలో మెడికల్ అసోసియేషన్ 25వ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని ప్రారంభించారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కాకుమాను సదాశివ రెడ్డి, నిడమానూరి సురేంద్ర, బత్తుల విష్ణు, సయ్యద్ ఖాదర్‌బాషా, విద్యుత్‌శాఖ డెప్యూటీ ఇంజినీర్ వై.ఏడుకొండలు, ఆర్యవైశ్య నాయకులు చేగు వెంకటేశ్వరరావు, ప్రవల్లికా సత్యం, స్కాలర్‌షిప్ సొసైటీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

### ఖోఖో జిల్లా జట్టుకు ఎంపికైన గుడ్‌షెపర్డ్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కోచ్

**వినుకొండ(నూజెండ్ల):** నరసరావుపేటలోని శంకరభారతి పురం ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో జూనియర్స్ బాల బాలికల జట్ల ఎంపిక పోటీల్లో పట్టణంలోని గుడ్‌షెపర్డ్ స్కూల్‌కు చెందిన డి.తేజ, యు.మహేష్‌లు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ జి.ఇన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరు ఈ నెల 20 నుంచి 22 వరకు చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రిన్సిపాల్ జి.సునీత, మదన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు అజీమ్, వెంకటేష్, వెంకట్, నాగరాజు, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.